పావుగంట తరువాత మరలా లైనులోకి వచ్చాడు శివరామన్.

"సారీ టు సే సో.. బట్ ఈ డీల్ మీరు చేసుకోకపోతే మంచిది.." సందేహి స్తూనే చెప్పాడు.

"ఎందుకు? "

"ఎందుకంటే..? " ఏదో చెప్పబోయి ఆగి పోయాడు అతను.

"అది ఫోన్‌లో చెప్పటం కంటే.. ప్రత్య క్షంగా వివరిస్తేనే బాగుంటుంది. నేను ఇప్పుడే బయలు దేరుతున్నాను. మరో రెండుగంటల్లో ఫ్లైట్ ఉంది. అన్ని విష యాలూ మీకు చెప్తాను"

"మంచిది.. ఎయిర్‌పోర్ట్‌కి కారు పంపి స్తాను. సరాసరి ఇక్కడికే వచ్చేయండి. మీరు వచ్చేవరకూ నేను ఆఫీసులోనే ఉంటాను"

శివరామన్ హైదరాబాద్ చేరుకుని సహదేవ్ ఆఫీసుకు వచ్చేటప్పటికి రాత్రి అయింది.

ఈ ప్రాజెక్టులో పనిచేసిన సిబ్బంది అందరూ సహదేవ్‌తో పాటు అతని కోసం ఎదురుచూస్తున్నారు.

బయటకు చెప్పకపోయినా.. తమకు ఇంత మందికి కనిపించని లోపం అతనికి ఏమి కనిపించిందా అన్న కుతూహలం అందరిలో ఉంది.

శివరామన్ రావటంతోనే అందరికీ 'సారీ' చెప్పాడు.

"నేనేదో మీకంటే తెలివయిన వాడిననీ.. గొప్పవాడిననీ రుజువు చేసుకోవటానికి ఈ పని చెయ్యటం లేదు. నాకు తెలిసి ఒక మోసం జరుగుతుంటే.. చూస్తూ ఊరుకో లేక వచ్చాను" అన్నాడు శివరామన్.

"మోసమా? " అందరూ ఒకేసారి అన్నారు.

"అవును. మీకు లాండ్ అమ్ముతున్న వారు అసలు ఓనర్స్ కాదు. మీరు గమ నించారో, లేదో.. రేటు కూడా మీకు అను కూలంగానే కుదిరింది.. ఆ లాండ్ త్వరగా వదిలించుకోవటానికే వారు తొందరపడు తున్నారు.."

"కానీ.. మేము అన్ని విధాలుగా వెరిఫై చేశామే!"

"చేశారు. కానీ జరిగిన మోసం చాలా పాతది. అందుకే మీ దృష్టికి రాలేదు. అసలేం జరిగిందంటే.. మీరు కొందామను కుంటున్న స్థలం అసలు యజమానులు - నిజాం వారసులు. నగరానికి ఎక్కువ దూరంలో బయట ఉన్న ఈ స్థలం ముందు ముందు ఇంత విలువ చేస్తుందని వారు ఊహించలేదు. అందుకే దాని గురించి వారు పట్టించుకోలేదు. పైగా వారు ఆస్ట్రేలియాలో సెటిల్ అవటంతో.. ఇక్కడి వివరాలు, లేటెస్ట్ డెవలప్‌మెంట్స్ గురించి వారికి ఆలస్యంగా తెలిసింది. ఈ స్థలాలను స్వాధీనం చేసుకోవటానికి తమ తరపున ఇక్కడ ఒక లాయర్ని పెట్టుకు న్నారు. అతని ఎంక్వయిరీలో ఈ స్థలా లన్నీ ఇప్పటికే అనేకమంది చేతులు మారాయని తేలింది. అతను అదే విషయం వారికి తెలియచేశాడు. ఇప్పుడు వారు స్వయంగా ఇక్కడకు రాబోతు న్నారు. తమ దగ్గర ఉన్న డాక్యుమెంట్స్ సమర్పించి తమ స్థలం తమకు అప్పచెప్ప మని ప్రభుత్వాన్ని అడగబోతున్నారు. ఒక రాజకీయ పార్టీ వారికి సహకరించబో తోంది. ఈ సమస్య ఎప్పటికి తేలుతుందో ఎవరికీ తెలియదు. అది తేలేవరకూ మీ ప్రాజెక్టు ముందుకు జరగదు.."

వింటున్న అందరి కళ్లూ ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"ఎవరికీ తెలియని ఈ విషయాలు మీకు ఎలా తెలిశాయి? " ఎవరో ఇంకా అనుమానంగా అడిగారు.

"వారు ఏర్పాటు చేసుకున్న లాయర్ నా

స్నేహితుడే! అయినా ఈ విషయం వచ్చే గురువారం ప్రెస్‌మీట్ పెట్టి వారే చెప్పబో తున్నారు. మీరు అప్పటి వరకూ రిజిస్ట్రే షన్ ఆపుకోండి. అన్ని విషయాలూ బహి ర్గతమవుతాయి.

ఆ హాలంతా నిశ్శబ్దంతో నిండిపో యింది.

సహదేవ్ ముందుగా తేరుకున్నాడు.

"ఎవరూ నిరుత్సాహ పడవలసిన అవ సరం లేదు. మనకి ప్రస్తుతం జరిగిన నష్టం ఏమీ లేదు! కాకపోతే మరొక స్థలం దొరికే సరికి సమయం పడుతుంది. కాబట్టి మన ప్రాజెక్ట్ కొంత ఆలస్యం కావచ్చు. బెటర్ లేట్ దాన్ నెవర్! రేపటి నుండి మరొక స్థలం కోసం అన్వేషణ ప్రారంభిద్దాం!"

అందరూ అతని పాజిటివ్ దృక్పథానికి స్పందించి చప్పట్లు కొట్టారు.

సమావేశం ముగిసిందనుకుంటున్న సమయంలో.. శివరామన్ సన్నగా దగ్గాడు.

అందరి దృష్టీ మరలా శివరామన్‌వైపు తిరిగింది.

"మీ ప్రాజెక్ట్ లేటయ్యే అవసరం కూడా లేదు. మీకు అంగీకారం అయ్యే పక్షంలో సరిగ్గా మీ ప్రాజెక్ట్‌కు సరిపోయే స్థలం నేను చూపిస్తాను. మిగిలిన విషయాలన్నీ అంగీకారం అయిన పక్షంలో.. ఆ డీల్ కుదుర్చుకుని మీరు అనుకున్న సమయా నికి మీ ప్రాజెక్ట్ పూర్తి చేసుకోవచ్చు"

"మీ దగ్గరలేని సొల్యూషన్ లేదా? " ఆనందంగా అన్నాడు సహదేవ్.

"ప్రపంచంలో ప్రాబ్లమ్స్ ఉన్నంత వరకూ వాటి పరిష్కారాలూ ఉంటూనే ఉంటాయి. మనం చేయవలసిందల్లా వాటిని వెతికి పట్టుకోవటమే!"

అందరి మనసులూ ఆనందంగా మారాయి. అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

అందరూ బయటకు వచ్చారు.

"కమాన్.. రండి! మా ఇంటికి వెళ్దాం" శివరామన్‌ని ఆహ్వానించాడు సహదేవ్.

"మీకెందుకు సార్ ఇబ్బంది.. నేను హోటల్‌కి వెళ్తాను.."

"మనం మాట్లాడుకోవలసిన విషయాలు ఇంకా ఉన్నాయనుకుంటున్నాను. తరు వాత హోటల్‌కి వెళ్దురులెండి.." అంటూ శివరామన్‌ని తన ఇంటికి తీసుకువెళ్లాడు సహదేవ్.

ఇంటికి వెళ్ళగానే అతని భార్య భారతిని 'అక్కా' అని పిలిచి వరుస కలిపాడు శివ రామన్.

ఆమె మొహమాటంగా నవ్వి భోజనాలు అవగానే పక్కకు వెళ్లిపోయింది.

చివరకు తను అడగదలుచుకుంది అడి గాడు సహదేవ్, "శివరామన్! మీరు మా కంపెనీలో ఎందుకు చేరకూడదు? మిమ్మల్ని మా కొత్త రియల్ ఎస్టేట్ డివి జన్‌కి వైస్ ప్రెసిడెంట్ చేస్తాను. మీరు అడిగినంత పేమెంట్ ఇస్తాను"

"ఇప్పటికిప్పుడు కంపెనీ మారట మంటే.. అయినా ఆలోచించి చెప్తాను.." అన్నాడు శివరామన్.

ఇంతలో ఏదో గుర్తుకు వచ్చి "అన్నట్లు, లాండ్ ఖరీదు పేమెంట్ ఎలా చేస్తు

న్నారు? ” అన్నాడు.
“కొంటుంది కంపెనీ తరపున కదా! బ్లాక్‌లో కొనటం కుదరదు.. అందుకే మొత్తం ఖరీదు అఫీషియల్‌గానే చూపిస్తున్నాం..”
“ఇందాక మీరన్నారు కదా! నా దగ్గర ప్రతి సమస్యకీ ఒక సమాధానం ఉంటుందని.. మీరు వింటానంటే ఒక సలహా చెప్తాను..”
“చెప్పండి.. చెప్పండి..” కుతూహలంగా అడిగాడు సహదేవ్.
“మీరు కొనబోతున్న స్థలం నలభై కోట్లనుకోండి. దాని గవర్నమెంటు వాల్యూ పది కోట్లనుకోండి. కాగితాల మీద గవర్నమెంటు వాల్యూ చూపించి మిగిలింది బ్లాకులో ఇచ్చారనుకోండి.. పదిహేను శాతం టాక్సు, ఖర్చులు ఆదా అనుకుంటే.. ఇప్పటికిప్పుడు మీకు నాలుగున్నర కోట్ల ఆదాయం అన్నమాట. కాకపోతే ఈ పని చెయ్యాలంటే మీ దగ్గర ముప్పై కోట్ల బ్లాక్ మనీ ఉండాలి!”
“బ్లాక్ మనీ సమస్య కాదు. కానీ మనం స్థలం కొంటున్నది కంపెనీ పేరుతో కదా! తిరిగి మనం పెట్టుబడి పెట్టిన బ్లాక్ మనీ వసూలయ్యేది ఎలా? ”
“నలభై కోట్ల స్థలంలో మీరు కట్టే టౌన్‌షిప్ విలువ వెయ్యికోట్లు ఉంటుందనుకోండి. దానిలో పది శాతం కాష్ పేమెంట్‌ను బిల్లు ఇవ్వకుండా తీసుకోండి. వంద కోట్లు వస్తుంది. ముప్పై కోట్ల పెట్టుబడితో రెండేళ్ళలో వంద కోట్లు సంపాదించవచ్చు.”
“ముప్పై కోట్లు తీసుకురావటం పెద్ద విషయం కాదు. కానీ.. నా డబ్బు మొత్తం స్విస్ బ్యాంకులో ఉంది. అంత పెద్ద మొత్తం ఇండియన్ కరెన్సీలోకి మార్చి ఇక్కడకు తేవటం..”
“సమస్యే కాదు.. మీరు ‘ఊ’ అనండి. నాకు తెలిసిన హవాలా ఏజెంట్ ద్వారా మీకు కావలసిన సొమ్ము ఇండియన్ కరెన్సీలో అందే ఏర్పాటు చేయిస్తాను. మీరు మీ స్విస్ ఎకౌంట్ నుండి అతను చెప్పిన ఎకౌంట్‌కి ఫారిన్ కరెన్సీలో డబ్బు పంపండి”
సహదేవ్‌కి అతను చెప్తున్న మాటలు వింటుంటే.. అమృతం తాగినంత రుచిగా ఉంది. ఇటువంటి వ్యక్తిని ఇంతకాలం కలుసుకోనందుకు విచారిస్తూ ప్రస్తుతానికి అతనికి వీడ్కోలు పలికాడు.
ఇద్దరూ విడిపోయినా.. ఇద్దరి ఆలోచనలూ అంతవరకూ తమ మధ్య జరిగిన సంభాషణ చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.
సహదేవ్ తనకు రాబోతున్న వందల కోట్ల లాభం గురించి ఆలోచిస్తుంటే.. శివరామన్ ఆలోచనలు సహదేవ్ స్విస్ బ్యాంకు ఎకౌంట్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

★ ★ ★

సంభాషణ ముగించి శివరామన్‌కి గుడ్‌బై చెప్పి బెడ్‌రూంలోకి వెళ్ళిన సహదేవ్‌కి ఇంకా నిద్రపోని భారతి కనిపించింది.
“ఏమిటి? ఇంకా నిద్రపోలేదా? ”
ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా “ఎవరతను? ” అని అడిగింది ఆమె.
“అతనా.. శివరామన్! అని గొప్ప తెలివితేటలు ఉన్న వ్యక్తి. ఈ రోజు మన కంపెనీకి మంచి సలహా ఇచ్చి రాబోతున్న పెద్ద నష్టాన్ని నివారించాడు. అంతేకాకుండా ముందు ముందు లాభాలు సంపాదించే ఐడియా కూడా ఇచ్చాడు”
“అతని తెలివితేటలు సంగతేమో కానీ.. మనిషి మాత్రం నిజాయతీపరుడూ, నమ్మదగిన వ్యక్తీ అనిపించటం లేదు”
“నీకెలా తెలుసు? ” ఆశ్చర్యంగా అడిగాడు సహదేవ్.
“అతని కళ్ళలో నిజాయతీ లేదు. అవి



కపటత్వంతో నిండి ఉన్నాయి. నా మనసు అతనితో జాగ్రత్తగా ఉండమని చెబు తోంది"

"నాకేమీ అలా అన్పించలేదే? "

"మీరు నా మాట ఎప్పుడువిన్నారు కనుక! నేను చెప్పదలుచుకున్నది చెప్పాను. ఆపై మీ ఇష్టం.." అని అటు తిరిగి పడుకుంది ఆమె.

## 5



**శి**వరామన్ చెప్పిన విధంగానే లాండ్ డీల్ కుదుర్చుకుంది నాయుడమ్మ అండ్ కంపెనీ. పనులు పూర్తివేగంతో జరుగుతు న్నాయి. ఆ ప్రాజెక్టుకు మంచి పేరు రావ టంతో.. దానిలోని విల్లాలూ, అపార్ట్ మెంట్లూ హాటు కేకుల్లాగా అమ్ముడుపోతు న్నాయి. అవి కొంటున్నవారు కూడా పది శాతం బ్లాక్ మనీగా ఇవ్వటానికి సందేహిం చటం లేదు. సహదేవ్ స్విస్ బ్యాంక్ ఎకౌంట్‌లో డబ్బు ఎప్పటికన్నా ఎక్కువ వేగంగా పెరగసాగింది.

సహదేవ్ ఆహ్వానం మీద శివరామన్ వైస్ ప్రెసిడెంట్ హోదాలో అతని కంపె నీలో చేరాడు.

సహదేవ్‌కి శివరామన్ మీద పూర్తి నమ్మకం ఏర్పడింది. అలాగే శివరామన్‌కి సహదేవ్ ఇంట్లో చనువు బాగా పెరిగింది. ఇంట్లో మనిషిలా రాకపోకలు సాగిస్తు న్నాడు. అతని మీద భారతి వెలిబుచ్చిన అభిప్రాయాలను అసలు పరిగణనలోకి తీసుకోలేదు సహదేవ్.

★ ★ ★

సంవత్సరం గడిచింది. మరొక పెద్ద ప్రాజెక్టుకు అంకురార్పణ చేశాడు శివరా మన్. తను తయారుచేసిన కొత్త ప్రాజెక్టు గురించి చర్చించటానికి సహదేవ్‌తో పాటు అతని ఇంటి గార్డెన్‌లో స్విమ్మింగ్ పూల్ పక్కన కూర్చుని ఉన్నాడు.

ఈ మధ్య ఆఫీసు విషయాలు కూడా ఎక్కువగా ఇక్కడ కూర్చునే చర్చించుకుం టున్నారు వారిద్దరూ!

ఇద్దరి మధ్యా టేబుల్ మీద డ్రింక్సు ఉన్నాయి.

శివరామన్ అప్పుడప్పుడూ డ్రింక్ సిప్ చేస్తూ తన కొత్త ప్రణాళిక గురించి చెప్తు న్నాడు.

"ఇది కనుక మనం సక్సెస్‌ఫుల్‌గా అమలు చెయ్యగలిగితే రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే పెద్ద ప్రాజెక్టు అవుతుంది. హైదరాబాద్ నగరం రోజు రోజుకీ పెరిగి పోతోంది. దానికి తగినట్లు స్టార్ హోటల్స్ పెరగటం లేదు. ప్రస్తుతం నగ రంలో ఫైవ్ స్టార్ హోటల్స్ కొరత బాగా ఉంది. అలాగే అంతర్జాతీయ స్థాయి సమావేశం ఏది జరగాలన్నా.. నగరంలో ఆ స్థాయికి తగ్గ సదుపాయాలు లేవు. ఉన్న ఒకటి రెండు సెంటర్లూ ట్రాఫిక్ మధ్య చిక్కుకుపోతున్నాయి. ఎయిర్‌పోర్ట్ వరకూ వచ్చిన అతిథులు సమావేశాలకు హాజరు కావటానికి కష్టపడవలసి వస్తుంది. ఒక్కొక్కసారి అసలు అటెండ్ కాకుండానే వెనుతిరగవలసి వస్తుంది"

"అవును! నాకూ అలాంటి అనుభవమే ఎదురయింది. ఒకరోజు సాయంత్రం ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లైట్ దిగిన నేను ఇంటికి చేరేటప్పటికి అర్ధరాత్రి అయింది.."